## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఏపీ గురుకుల విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులు సింధూర, అశ్విని

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బన వాసి ఏపీ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం కర్నూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభను కనపరచి రాష్ట్ర స్థాయికి ఎంపికై తమ సత్తా చాటుకున్నారు. ఆదివారం పాఠశాల ప్రిన్సిపాల్ సామ్రాజ్యం మాట్లాడుతూ పాఠశాలలో 300 మీటర్ల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని కె. సింధూర, 200 మీటర్ల విభాగంలో 8వ తరగతి విద్యార్థిని కె.అశ్వినిలు తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులతో పాటు పీఈటీ ప్రభావతిని ప్రిన్సిపాల్ అభినందించారు.

### ఆదోని పట్టణాన్ని అభివృద్ధి చేయాలి

ఆదోని టౌన్: పట్టణాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ఆదోని ఇన్‌చార్జ్ రమేష్‌యాదవ్, మాజీ డీసీసీ జిల్లా అధ్యక్షుడు మారుతిరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికార పార్టీ దృష్టి సారించాలన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడతామని, ప్రజాసేవకే కాంగ్రెస్ పార్టీ అంకితమన్నారు. పట్టణంలోని సాయినగర్‌లో సమస్యలు తిష్టవేశాయని, వాటిని పరిష్కరించడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారన్నారు. కాలనీలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు దేవిశెట్టి ప్రకాష్, విద్యార్థి సంఘం నాయకులు శ్రీనిత్, రఘునాథ్‌యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఉక్కు పరిశ్రమలో కార్మికులను తొలగించొద్దు

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ వైపు అడుగులేస్తూ కార్మికులను తొలగించేందుకు పూనుకుంటే సహించేది లేదని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమలో 4,290 మంది కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం గేట్‌పాస్‌లు వెనక్కు తీసుకోవడం చూస్తే ప్రైవేటీకరణకు అడుగులేస్తున్నట్లు కనిపిస్తుందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణపై పునరాలోచించి తమ నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎల్లప్ప, సుంకన్న, నరసప్ప, విజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

ఆదోని రూరల్: మండలంలోని దొడ్డనకేరి గ్రామంలో హోటల్ గిడ్డయ్య ఇంటి నుంచి శ్మశానం వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని సీపీఎంమండల కార్యదర్శి కె.లింగన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. దొడ్డనకేరి నుంచి సుల్తానాపురం వరకు, దొడ్డనకేరి నుంచి బల్లేకల్ వరకు రైతుల పొలాలకు వెళ్లే రస్తాలకు గ్రావెల్ వేయాలన్నారు. గ్రామంలో ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైపులైన్ లీకేజీల సమస్యలు ఉన్నాయని, వాటిని అధికారులు పరిష్కరించాలన్నారు. సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శివర్గ సభ్యులు డి.రామాంజనేయులు, నాగరాజు, ఈరన్న, తిక్కన్న, కమల్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



బాధితులకు నగదును అందజేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల కేంద్రంలో గత బుధవారం విద్యుదాఘాతంతో గుడిసె కాలిపోయి సర్వం కోల్పోయిన మంచోది శాంతిరాజు కుటుంబానికి అండగా ఉంటామని చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు భరోసా నిచ్చారు. ఈ మేరకు ఆదివారం సంస్థ సభ్యులు ప్రసన్నరాజు దంపతులు రూ. 22వేలు నగదును అందజేశారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు పెద్దకడబూరు గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రవీణ్, సుధాకర్, ప్రకాష్, రామచంద్ర, జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, నందవరం జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మార్కెట్‌లో అక్రమాల జోరు

- ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో దళారుల పెత్తనం
- కమీషన్ ఏజెంట్లు.. వ్యాపారులు కుమ్మక్కు
- సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్న వ్యాపారులు
- అధికంగా కమీషన్ వసూలు
- జోరుగా జీవో వ్యాపారం



యార్డ్‌లో విక్రయానికి వచ్చిన దిగుబడులు



మార్కెట్ బయట విక్రయాలు ఇలా..

ఎమ్మిగనూరు:దళారుల పెత్తనం.. వ్యాపారులు–ఏజెంట్లతో కుమ్మక్కైన అధికార యంత్రాంగం వల్ల అన్నదాత దగా పడుతున్నాడు. మార్కెట్‌యార్డులో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్టపడకపోవడం, బహిరంగ మార్కెట్‌లో వ్యాపార లావాదేవీలకు అధికార యంత్రాంగం పచ్చజెండా ఊపి రైతన్నను నిలువునా ముంచుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించకపోగా.. రైతులను మోసగించడమే లక్ష్యంగా పెట్టుకున్న ఏజెంట్ మాఫియాకు కేంద్రంగా మారిన ఎమ్మిగనూరు వ్యవసాయమార్కెట్ యార్డులో అన్నదాత ఆక్రందనలు నిత్యకృత్యమయ్యాయి.

**ఉత్తమ మార్కెట్‌గా గుర్తింపు**

ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు జిల్లాలోని ఉత్తమ మార్కెట్లలో ఒకటిగా ప్రత్యేక గుర్తింపుంది. ఇక్కడికి ఎమ్మిగనూరుతో పాటు ఆలూరు, పత్తికొండ, డోన్, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాలతో పాటు కర్ణాటకలోని రాయచూరు జిల్లా, తెలంగాణ నుంచి అలంపూరు నియోజవకవర్గం నుంచి దిగుబడులు విక్రయానికి తీసుకువస్తుంటారు. ఎక్కువగా వేరుశనగ, పత్తి, కందులు, మొక్కజొన్న, శనగ, ఆముదాలు విక్రయానికి తీసుకొస్తుంటారు. ఆదివారం మార్కెట్‌కు 2,346 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ట ధర రూ.6,290 పలికింది. ఆముదాలు 1033 క్వింటాళ్లు రాగా ధర రూ.5,810 ఉంది. వేరుశనగ వారానికి సగటున 8వేల క్వింటాళ్లు, సీజన్ మొత్తంలో 40 నుంచి 50 వేల క్వింటాళ్లు వస్తుంది.

**రైతుకు దక్కని భరోసా**

ఎమ్మిగనూరు మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్న భరోసా ఉండేది. కానీ ఇది గతం . ప్రస్తుతం ఇక్కడ కూడా రైతన్న దగా పడుతున్నాడు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు సిండికేట్‌గా మారి ధరలను పూర్తిగా తగ్గించేస్తున్నారు. దీనికి తోడు యార్డ్‌లో జరిగే క్రయ విక్రయాల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఖరీఫ్, రబీ అనీ తేడాలేకుండా దిగుబడులు మార్కెట్‌కు భారీగా తరులుతున్న కొద్దీ గిట్టుబాట ధర రోజురోజుకు పతనమవుతోంది. ఈ– నామ్‌ను సైతం ఏమారుస్తున్నారు. అలాగే 2శాతం కమీషన్ ఉండగా నిబంధనలకు విరుద్ధంగా 4 నుంచి 8 శాతం వసూలు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యమే.

**బైలాను పక్కనపెట్టి రూ.2 వడ్డీ వసూలు**

మార్కెట్ యార్డ్ బైలా ప్రకారం రైతు వద్ద నుంచి కొనుగోలు చేసిన సరుకుకు కమీషన్ ఏజెంట్లు 24 గంటల్లోపు ఎలాంటి వడ్డిని మినహాయించుకోకుండా డబ్బు చెల్లించాలి. కానీ ఇక్కడ కమీషన్ ఏజెంట్లు 24గంటల్లోపు రైతులు డబ్బు అడిగితే రూ.2 వడ్డీని మినహాయించుకొని చెల్లించాల్సిన మొత్తాన్ని ఇస్తున్నారు. వడ్డీ లేకుండా డబ్బు కావాలంటే నెలరోజులు గడువును విధిస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాటాలను మార్కెట్‌లో ఏర్పాటు చేసినా రైతుల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని నంబర్ గేమ్‌తో తూకాల్లో కూడా మోసాలకు పాల్పడుతున్నారని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. గిట్టుబాటు ధర కల్పించకపోగా అధిక దళారీ, డబ్బు చెల్లింపులో అక్రమాలు, తూకాల్లో మోసాలు ఇలా యార్డ్‌లో రైతు దగాపడుతున్నాడే తప్ప రైతు సంక్షేమం కనిపిస్తే ఒట్టే.

**జోరుగా జీరో వ్యాపారం**

రైతులను దగా చేయడమేకాక మరో పక్క యార్డ్ ఆదాయానికి సిబ్బంది సహకారంతో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు గండిపెడుతున్నారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన సరుకును అరెవల్ రిజిష్టర్‌లో నమోదు చేస్తూ బిల్లు వేయాల్సి ఉండగా ఇందులోనూ అక్రమాలకు తెరలేపుతున్నారు. కొంత సరుకును రిజిష్టర్‌లో నమోదు చేయకుండా జీరో వ్యాపారాన్ని సాగిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇక యార్డ్‌లో దుకాణాలకు లైసెన్సులు తీసుకున్న కొద్ది మంది వ్యాపారులు, అలాగే ఎలాంటి లైసెన్సు లేని వారు కూడా ఇతరుల పేరుతో కొనుగోలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. మార్కెట్‌యార్డులో పత్తి మార్కెట్‌ను మూసేయడంతో కాటన్ మిల్లులతో పాటు, ప్రైవేటు వ్యక్తులు పలు ప్రాంతాల్లో సమాంతర మార్కెట్‌ను నడుపుతున్నారు. 10 బస్తాలలోపు సరుకు ఉన్న రైతులు పట్టణ శివారులో ఉన్న యార్డ్‌కు తీసుకువెళ్లకుండా కమీషన్ ఏజెంట్లు పట్టణంలో అక్రమంగా క్రయవిక్రయాలు నడుపుతున్న వ్యాపారుల వద్ద విక్రయిస్తున్నారు. అక్రమ వ్యాపారస్తులతో యార్డ్ అధికారులు లాలూచి పడటంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు..ఆరుకాయలుగా సాగుతోంది. బయట సరుకును కొనుగోలు చేస్తున్న వ్యాపారులు యార్డ్‌కు సెస్సును చెల్లించకుండా నేరుగా జీరో వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**

యార్డ్‌లో అక్రమాలు జరుగుతున్నట్లు రైతులు గుర్తించి నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. 24 గంటల్లోపు సరుకు కొనుగోలుకు సంబంధించిన డబ్బు రైతుకు చెల్లించాల్సిందే. బయట జరుగుతున్న అక్రమవ్యాపారులపై దాడులు చేసి కేసులు నమోదుచేస్తాం.

– పద్మావతి, యార్డ్ కార్యదర్శి

### తాగునీరు కలుషితం



కుళాయి నీటిలో వచ్చిన చెత్త, పాచి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో కుళాయిలకు కలుషిత నీటిని సరఫరా అవుతున్నారు. కుళాయిల నుంచి చెత్త, పాచీ ఉన్న నీరు వచ్చాయి. గోనెగండ్ల మండలం అల్వాల గ్రామం సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నుంచి మండలంలోని దైవందిన్నె, పెసలదిన్నె, గార్లదిన్నె, ఏనుగుబాల గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఆదివారం గార్లదిన్నె గ్రామంలో కుళాయి నుంచి చెత్తా, పాచి, రంగు మారిన నీరు వస్తుండటంతో ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేయకుండా సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి కలుషిత నీటిని ప్రజలు తాగితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన నీటిని కుళాయిలకు సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ఉరుసుకు ఏర్పాట్లు పూర్తి

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి ఉరుసులో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశామని సర్పంచ్ కురువ చాముండేశ్వరి తెలిపారు. ఆదివారం సర్పంచ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దర్గప్ప, ఎస్కే గిరి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ట్యాంకర్‌తో మంచినీటి సరఫరా, దర్గా పరిసరాలు, వీధులను శుభ్రం చే యించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. తాగునీటి వ సతి, వీధిలైట్లు, డ్రైనేజీలలో పూడిక తీత పనులు చేపట్టడంతో పాటు ఇతర సదుపాయాలు కల్పించారు.

## గొప్ప మానవతావాది గుర్రం జాషువా



జాషువా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

ఆదోని సెంట్రల్: గొప్ప మానవతావాది గుర్రం జాషువా అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప తెలిపారు. ఆదివారం కిడ్డీస్ పాఠశాలలో అరసం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్ అధ్యక్షతన గుర్రం జాషువా జయంతిని ఘనంగా జరుపుకున్నారు. సాహితీస్రవంతి, అరసం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బల్లెకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్య జాషువా సాహిత్యం, జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమములో కవి నల్లారెడ్డి, కళాకారులు చిగిళి లక్ష్మన్న యాదవ్, సాహితి స్రవంతి, అరసం సభ్యులు అమలనాథన్, మహాదేవప్ప, స్వయం ప్రభ, సుబ్బన్న, సుధాకర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తతతో గుండె జబ్బుల నివారణ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: అప్రమత్తతతో గుండె సంబంధించిన జబ్బులను నివారించవచ్చని మధు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ లీలావతి తెలిపారు. ప్రపంచ హార్ట్ డే సందర్భంగా మధు ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. భీమాస్ సర్కిల్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఛాతిలో నొప్పి, గుండె దడ, కళ్లు తిరగడం, వెన్నులో నొప్పి, ఆయాసం తదితర సమస్యలు గుండె వ్యాధికి సంబంధించినవేనని తెలిపారు. అప్రమత్తమై ముందుగా ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకుంటే వ్యాధి నుంచి బయటపడొచ్చన్నారు. కార్యక్రమంలో మేనేజర్ సునీల్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ధర్మ, ఉపేంద్ర, మధు తదితరులు పాల్గొన్నారు.

## బడుగులపై దాడులు అరికట్టాలి



సోమప్ప సర్కిల్‌లో నినాదాలు చేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: బడుగులైన దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనారిటీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు ఎస్.రాజు, ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే స్థాపించిన సత్యశోదక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక సోమప్ప సర్కిల్‌లో ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బడుగులపై దాడులు, అత్యాచారాలు అరికట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేసి మాట్లాడుతూ జ్యోతిరావ్ పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు, ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రతాప్, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: పట్టణంలో ఉన్న విద్యార్థులకు, నిరుద్యోగ యువత ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథి సూచించారు. ఆదివారం పెద్ద పోస్టు ఆఫీసు రోడ్డులోని హజరత్ సయ్యద్‌మీర్ మహ్మద్‌షా ఖాద్రి దర్గా అండ్ మస్జీద్ కమిటీ వారి ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడానికి ఆదోని నియోజకవర్గంలో మరికొన్ని సంస్థలు ముందుకు రావాలన్నారు.

### తప్పిపోయిన పిల్లలు తండ్రి చెంతకు



తండ్రి ఇస్మాయిల్‌తో కుమారులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఖాజీపురం కాలనీకి చెందిన ఇస్మాయిల్ కుమారులు సోహేల్, ఇస్మాయిల్‌లు ఆదివారం ఉదయం ఆడుకుంటూ తప్పి పోయారు. ఇంటి చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా పిల్లల ఆచూకీ తెలియలేదు. దీంతో వెంటనే ఆదోని వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తండ్రి ఇస్మాయిల్ తెలిపారు. గాలింపు చేపట్టిన పోలీసులు ఎట్టకేలకు పిల్లలను షరాఫ్ బజార్ ప్రాంతంతో గుర్తించి తండ్రికి అప్పగించారు.

## ఒక్క కార్యకర్తకైనా మేలు చేశారా?

ఆదోని అర్బన్: 40 ఏళ్ల రాజకీయంలో టీడీపీలో ఉంటూ ఏ ఒక్క కార్యకర్తకు అయినా మీరు మేలు చేశారా?... పార్టీ నుంచి మీ కుటుంబమే బాగు పడిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ ఎద్దేవా చేశారు. ఆదివారం ఉదయం టీడీపీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని సినీ నటుడు కమల్‌హాసన్ అని సంభోదిస్తూ మాట్లాడిన అంశంపై బీజేపీ నాయకులు సాయంత్రం స్థానిక భీమాస్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రంగస్వామినాయుడు.. మేము నీకు బ్రహ్మాండంగా నామకరణం చేశామని, నీవు కార్యకర్తగా కూడా పనికిరావన్నారు. కేవలం మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడి బామ్మర్దిగా గుర్తింపు మాత్రమే ఉందన్నారు. మీకు బకాయిలు రాలేదని శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో అన్నా క్యాంటీన్‌ను మూసి వేస్తామని రెచ్చిపోయారన్నారు. సమావేశంలో నాయకులు దేశాయి చంద్రన్న, సాయి, వేణుగోపాల్, వీరేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

**కమలహాసన్‌గా నటించొద్దు**

బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సినీ నటుడు కమలహాసన్ మాదిరిగా నటించొద్దని టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు బామ్మర్ది రంగస్వామినాయుడు ఎద్దేవా చేశారు. శనివారం కౌన్సిల్ హాల్‌లో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నా క్యాంటీన్ మరమ్మతులకు అజెండాలో పెట్టి మరలా తీయడం ఏమిటన్నారు. పార్టీ చెప్పినట్లు వింటున్నామని, తమను చులకనచేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు తిమ్మప్ప, బుద్దారెడ్డి, వెంకటేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్.. మురుగుతో కష్టాల్



హాస్టల్ వెనుక భాగంలో నిలిచి ఉన్న మురుగు నీరు



నిరుపయోగంగా మారిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ప్రాంగణం కంపుకొడుతోంది. ఎగువ ప్రాంతాలలోని డ్రైనేజీలు, హాస్టల్‌లోని మురుగు నీరు అంతా హాస్టల్ వెనుక భాగంలో నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాస వెదజల్లుతోంది. హాస్టల్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి 240 మంది విద్యార్థులు చదువుతున్నారు. హాస్టల్ ముందు భాగంలో చెత్త సంపద సృష్టి కేంద్రం ఏర్పాటు చేశారు. అది ప్రారంభానికి నోచుకోక పోవడంతో అక్కడ పందులు స్వైర్వ విహారం చేస్తున్నాయి. ఆ ప్రాంతం అంతటా దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో హాస్టల్‌లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలోనే మూడు అంగన్ వాడీ కేంద్రాలు, కుమ్మరి వీధి ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. దుర్వాసన మధ్య విద్యార్థులు, చిన్నారులు నరక యాతన అనుభవిస్తున్నారు. పరిశుభ్రం చేయడంతో పంచాయతీ సిబ్బంది చూసీ చేడపట్టు వదిలేస్తున్నారు. సంబంధిత అధికారులు మురుగు నీరు నిల్వ ఉండకుండా, పందుల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

# ఇట్లు.. మీ లేఖ!

- మధుర జ్ఞాపకాలను మిగిల్చిన ఉత్తరం
- ఒకప్పుడు పోస్టు ద్వారానే సమాచారం





వచ్చిన లెటర్‌లను డెలివరీ చేసేందుకు సిద్ధం చేస్తున్న అధికారి

ఆదోని అర్బన్: తోకలేని పిట్ట 90 ఆమడల దూరం పోయింది. అది ఏమిటి అని సామెత అడిగిన వెంటనే ఉత్తరం అని సమాధానం వచ్చేది. అయితే ఇప్పుడు ఆ మాట చెప్పుకునేందుకు తప్పా ఉత్తరం రాసేవారే కరువయ్యారు. పోస్టు అని ఇంటి ముంగిట పోస్టుమెన్ కేక వేయగానే ఉత్తరం అందుకునేందుకు పరుగున వచ్చేవారు. తమ బంధుమిత్రులు అందించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉత్సరాల కోసం ఎదురుచూసేవారు. మంచి ఉత్తరాలను భద్రంగా దాచుకునేవారు. అవి ఇప్పుడు మధుర జ్ఞాపకాల్లా మిగిలిపోయాయి.

**ఉత్తరంలో మనస్సుకు హత్తుకునేలా సంబోధన..**

నేటి సమాజంలో పిల్లలకు పోస్టులో ఉత్తరం వచ్చి దానిని చదువుకుని ఎంతో తృప్తిపడేవారమని పెద్దలు చెబితే.. ఇంకా లేఖలు ఏమిటి... నేరుగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటున్నాం కదా.. అని సమాధానమిస్తున్నారు. నేడు ముఖాముఖిగా వాట్సాప్ కాల్‌లో మాట్లాడుతున్నా సంబోధనల్లో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. అయితే ఉత్తరంలో పలకరింపులు, సంప్రదాయబద్ధంగా ఉంటూ మనస్సును ఆకట్టుకునేలా ఉండేవి. పెద్దలైతే మహారాజశ్రీ, చిన్న వారు అయితే 'చిరంజీవి', మహిళలను 'లక్ష్మి సమానురాలైన', వితంతువులు అయితే 'గంగాభగీరథి సమానులైన' అనేలా సంబోధించేవారు. అలాగే ఉత్తరం ప్రారంభం, ముగింపులో పెద్దలకు అయితే నమస్కారాలతో అని, చిన్న వారికి ఆశీస్సులతో... అని రాసేవారు. ఎవరైనా కాలం చేసిన వార్తను ఉత్తరంలో రాసేటప్పుడు ఒక వైపున నలుపు రంగు ఉండేలా చూసేవారు. ఆ ఉత్తరాన్ని ఇంట్లోకి తీసుకెళ్లకుండా బయటనే చించివేసేవారు. అలాగే ముఖ్యమైన సమాచారం ఉండే లేఖలను జాగ్రత్తగా ఒక కమ్మికి కుట్టి పెట్టేవారు.

**నియోజకవర్గంలో నాలుగు పోస్టాఫీసులు**

పట్టణంలో ఒకటి ప్రధాన పోస్టాఫీసు కార్యాలయం , ఎస్కేడీ కాలనీ ఖాజీపూర్‌లో, బార్‌పేటలో, ఆర్ట్స్ కళాశాలలో పోస్టాఫీసులు ఉన్నాయి. ప్రతిరోజూ రిజిస్టర్, క్యాష్ ఆన్ డెలివరీ, స్పీడు పోస్టు, రిజిస్టర్ పోస్టులు, పార్సిళ్లు, వాల్యూమ్ టేబుల్ పోస్టు, వాల్యూమ్ టేబుల్ లెటర్లు, ఏటీఎంలు, కోర్టు నోటీసులు దాదాపుగా 500 నుంచి 600 వరకు వస్తున్నాయి. అదేవిధంగా ఆర్డినరీ లెటర్‌లు అయితే 400 నుంచి 500 వరకు పోస్టుమెన్‌లు అందజేస్తున్నారు. హెడ్ పోస్టాఫీసుల్లో 16 మంది పోస్టుమెన్‌లు, ఆర్ట్స్ కళాశాలలోని పోస్టాఫీసులో ఇద్దరు డెలివరీ పోస్టుమెన్‌లు ఉన్నారు. పూర్తిస్థాయిలో ఇంగ్లాండ్ లెటర్‌లు సెల్‌ఫోన్ రావడంతో తగ్గుముఖం పట్టాయి. బిజినెస్ లెటర్‌లు, ఆర్డినరీ లెటర్లు మాత్రమే పోస్టాఫీసు ద్వారా కార్యాలయాలకు, ఇళ్లకు అందుతున్నాయి.

**స్మార్ట్ ఫోన్ రాకతో ఉత్తరాల ఊసే లేదు**



ఆదోనిలోని హెడ్ పోస్టాఫీసు వద్ద పోస్టుబాక్సులు

ఉత్తరాలు రాసుకునే రోజుల్లో శ్రీవారికి ప్రేమలేఖ ఇలా ఎన్నో సినిమాలు తీశారు. అవి ప్రేక్షకులను సైతం విశేషంగా అలరించాయి. అయితే నేటి యువత చేతిలోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్లను గంటల తరబడి వాడుతున్నప్పటికీ అవతలి వారి యోగక్షేమాలను మాట్లాడే పరిస్థితి లేదు. ఒకటి, రెండు మాటలు మాట్లాడిన తర్వాత టిక్‌టాక్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ ఇలా వేరే వ్యాపకాలకు మొగ్గు చూపుతున్నారు. క్షేమ సమాచారాలను కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులతో పంచుకునేందుకు కూడా ఇష్టపడడం లేదు. ఉత్తరాలు రాసుకునే సమయంలో మరో ఉత్తరం వచ్చేంతవరకు ఎదురుచూపులు ఉండేవి. సమయం లేక రాయలేని వారికి ఉత్తరం రాసి చాలా రోజులయ్యిందనే దిగులు ఉండేది. కానీ నేడు స్మార్ట్ ఫోన్ రాకతో ఉత్తరాల ఊసే లేకుండా పోయింది. దీంతో యువత అరకొర సందేశాలను పంపుకుని సంతోష పడుతున్నారే గానీ పాత కాలంలోలాగా పూర్తి సమాచారం చదువుకుని తృప్తి పడలేక పోతున్నారు.

### అక్షర దోషాలు గుర్తించే వెసులుబాటు ఉండేది



ఉత్తరం రాసే సమయంలో వాటిలో ఎలాంటి తప్పులు దొర్లాయి అనే విషయాన్ని రాసేవారు. చదివేవారు దోశాలను గుర్తించేవారు. తెలిసిన వారు అయితే ఇలా రాయకూడదు, అలా రాయాలని చెప్పేవారు. దీంతో తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఉండేది. అక్షరదోషాలను పక్కాగా గుర్తించే వెసులుబాటు ఉండేది. అయితే ఇప్పుడు రాసే పని లేకుండా పోయింది. స్మార్ట్‌ఫోన్‌లో వాయిస్ మెసేజ్ పెడుతున్నారు. దీంతో ఎవరికి ఎలాంటి ఉపయోగం ఉండదు. మంచి ఉత్తరాలు అయితే దాచి పెట్టుకునేవారు. చదివి ఆనంద పడేవారు. అలాంటి ఆనందాలు సెల్‌ఫోన్‌లతోనే మటుమాయమయ్యాయి.

– రమేష్‌నాయుడు, తెలుగు ఉపాధ్యాయుడు

### సంతోషంగా ఉండేది



ఉత్తరాలు రాసుకుని అందులోని సమాచారం మననం చేసుకుంటూ మరో ఉత్తరం వచ్చేంతవరకు ఎదురుచూడడం ఎంతో మధురంగా ఉండేది. ఎందుకంటే ఉత్తరంలో రాసే ప్రతి అక్షరం మన మనస్సులోని భావాన్ని ప్రతిబింబిస్తాయి. చదువురాని వారు సైతం తమకు వచ్చిన ఉత్తరాన్ని తీసుకుని వచ్చి చదవమని ఇచ్చేవారు. ఆ సమయంలో అందులో వారికి సంబంధించిన మంచి విషయాలను చెబుతుంటే ఎంతో సంతోషంగా ఉండేది. పెద్దవారికి ఏదైనా సమాచారం తెలియజేయాలంటే ఉత్తరం ఒక సాధనంలా ఉండేది. ఇంటికి దూరంగా ఉన్న పిల్లలను హెచ్చరించేందుకు ఉపయోగపడేది. సెల్‌ఫోన్‌లతో సంతోషాన్ని, ఆనందాన్ని పోగొట్టుకున్నాం.

– ఈరన్న, ఆదోనివాసి